క్లుప్తంగా

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు



నందిగామ: పట్టణంలోని ముక్కోటి మండపంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్థానిక ముక్కోటి మహా మండపంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం శుక్ల యజుర్వేద పారాయణం, సుందర కాండ పారాయణ కార్యక్రమాలు జరిగాయి. రాత్రి సమయంలో డాక్టర్ నరసింహాదీక్షితులు చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు సోమవారం తెలిపారు. మండలంలోని 19సచివాలయాల పరిధి ఉన్న క్రీడా మైదానాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్రీడాకారులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

చింతలపాడు తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు



చందర్లపాడు(నందిగామ): చందర్లపాడు మండలం చింతలపాడులో మంగళవారం నుంచి మూడురోజులపాటు నూకానమ్మ తిరునాళ్ల మహోత్సవాలు జరగనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను నందిగామ ఏసీపీ జనార్దన్‌నాయుడు సోమవారం పరిశీలించారు. తిరునాళ్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేపట్టిన ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చించారు. బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఏసీపీ జనార్దన్‌నాయుడు మాట్లాడుతూ తిరునాళ్లను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి తిరునాళ్లను విజయవంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. ఏసీపీ వెంట ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

క్రిస్మస్ జోష్



గండేపల్లి సీఎస్ఐ చర్చిలో డ్యాన్స్‌లు వేస్తున్న విద్యార్థులు

కంచికచర్ల : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవ దేవాలయాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్రీస్తు స్తుతిగీతాలకు చిన్నారులు చేసిన నృత్యాలు అందరిలో జోష్ నింపాయి.

దాడి ఘటనపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): మద్యం మైకంలో ఇద్దరు వ్యక్తులు తనతో గొడవపడి దాడి చేసినట్లు మంతి శివదుర్గ ప్రసాద్ అనే వ్యక్తి సోమవారం నున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 24న పైపులరోడ్డు అవతల అలేఖ్య బార్ వద్ద శివదుర్గ ప్రసాద్ మద్యం సేవిస్తుండగా పోతిరెడ్డి, విజయకుమార్‌లు గొడవ పడుతున్నారు. గొడవ ఎందుకు అని శివదుర్గప్రసాద్ వారిని వారించే ఇంటికి వెళ్తుండగా పోతిరెడ్డి, విజయకుమార్‌లు షిర్డి హోటల్ వద్ద గొడవపడి ఇద్దరు కలిసి తనను దాడి చేశారు. శివదుర్గప్రసాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

రామవరప్పాడు: మహిళల స్వయం ఉపాధి నిమిత్తం ప్రభుత్వ సహకారంతో పలు ఉపాధి కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఇంటిగ్రేటెడ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ ఎస్.రూప సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. అడ్వాన్స్ బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. మూడు నెలల పాటు టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తామని ఆసక్తి ఉన్న మహిళలు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు గురునానక్ కాలనీలోని కార్యాలయంలో గాని, 99899 98779 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆమె సూచించారు.

క్రీస్తు జీవితం ఆచరణీయం

ప్రభుత్వ విప్ ఉదయభాను



పెనుగంచిప్రోలులో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న విప్ సామినేని ఉదయభాను, బత్తుల రామారావు

పెనుగంచిప్రోలు: ప్రపంచానికి ప్రేమ, శాంతి, సహనం అనే సద్గుణాలను బోధించిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. స్థానిక సత్రం సెంటర్‌లో మైనింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల రామారావు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్‌చేశారు. అనంతరం 100మంది వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు, నూతన వస్త్రాలను బహూకరించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ బైబిల్‌లో చెప్పిన విధంగానే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ, 108అంబులెన్స్ వాహనం వంటి ప్రపంచమంతా మెచ్చుకున్న పథకాలను రూపొందించగా, ఆయన తనయుడైన ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా పథకాలను పేదలకు మరింత చేరువ చేశారని కొనియాడారు. ఏటా ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమంటూ రామారావును అభినందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, పూసల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చేని కుమారి, శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు వేల్పుల రవికుమార్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, జంగం వీరమ్మ, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, నాయకులు దేంగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేకువజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు..

క్రిస్మస్ సందర్భంగా పెనుగంచిప్రోలు మండలంలోని అన్ని గ్రామాల చర్చిలు, పలు కూడళ్లలో సోమవారం క్రిస్మస్ సంబరాలను అత్యంతవైభవంగా నిర్వహించారు. ముచ్చింతాలలోని ప్రసిద్ధ లూర్థుమాత ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా క్రీస్తు పుట్టుక, మహిమలను ఫాదర్ దేవకుమార్ తెలియజేశారు. సియోను ప్రార్థనా మందిరం, జెజిఎం, షాలోమ్ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనగపాడు ఫెయిత్ చర్చిలో పాస్టర్ మేరుగ ఉదయశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వత్సవాయి మండలంలోని అన్ని చర్చిలలోనూ క్రిస్మస్ పండగను పురస్కరించుకుని క్రైస్తవులు వేకువజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నందిగామ మండలంలో..

నందిగామ: క్రిస్మస్ పండుగ సంబరాలు సోమవారం నందిగామ నియోజకవర్గవ్యాప్తంగా అంబరాన్నంటాయి. ఆర్‌సీఎం చర్చిలలో దివ్యబలి పూజలు, సీఎస్ఐ చర్చిలలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని చర్చిలలో క్రిస్మస్ కేక్‌లు కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నందిగామలోని వేళంగిణి మాత చర్చిలో రెవరెండ్ ఫాదర్ కమతం మరియదాసు ప్రత్యేక దివ్యబలి పూజ నిర్వహించారు. స్థానిక మధిరరోడ్డులోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బేతెస్థ, షాలోమ్, సీయోను,హోరేబు మందిరాల్లో ఆయా సంఘాల కాపరులు వాక్యోపదేశం చేశారు. పట్టణశివారుల్లోని శిలువగిరి చర్చి, రాఘవాపురంలోని పురాతన సీఎస్ఐ చర్చి, రామిరెడ్డిపల్లిలోని ఆర్సీఎం, సీఎస్ఐ చర్చిల్లో క్రిస్మస్ ఆరాధన కార్యక్రమాలు వేడుకగా జరిగాయి.

చందర్లపాడు మండలంలో..

చందర్లపాడు మండలంలో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

క్రీస్తు బోధనలతో సమాజంలో శాంతి..

జగ్గయ్యపేట: క్రిస్మస్ పర్వదిన వేడుకలను జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక దివ్యబలి పూజ, ప్రార్థనలు నిర్వహించి పండుగకు స్వాగతం పలికారు. పట్టణంలోని పోస్టాఫీస్ వద్దనున్న సెయింట్ థామస్ సీఎస్ఐ చర్చి, హైస్కూల్ రోడ్డులోని ఏసుతిరు హృదయ ఆర్‌సీఎం, కోదాడరోడ్డులోని బెతెస్థ, బలుసుపాడు రోడ్డులోని బేతోలు, విలియం పేట, క్రిస్టియన్ పేటల్లోని సీఎస్ఐ, తొర్రకుంటపాలెంలోని సీయోను చర్చిలు, ఆర్టీసీ కాలనీలోని హోసన్నా, కాకానినగర్‌లోని షాలేము ప్రార్థనామందిరాలపాటు నియోజకవర్గంలోని అన్ని చర్చిలలో ఉదయం నుంచి సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి.



కంచికచర్ల ఆర్‌సీఎంలో ప్రసంగిస్తున్న దత్తు



దైవసందేశం ఇస్తున్న వినయ్‌కుమార్



పెనుగంచిప్రోలు జేజీఎం చర్చిలో ప్రార్థనలకు హాజరైన భక్తులు

క్రిస్టియన్ పేటలో..

క్రిస్మస్ సందర్భంగా బలుసుపాడు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కేకును ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలతో సమాజంలో శాంతి నెలకొంటుందని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కేడీసీసీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, కౌన్సిలర్ పాకాలపాటి సుందరమ్మ, మాజీ కౌన్సిలర్ గెంటేల భాగ్యలక్ష్మి, పాస్టర్ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చిలో..

పేట బాలుర హైస్కూల్ రోడ్డులోని తిరుహృదయ ఆర్‌సిఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు వేల్పుల మాణిక్యాలరావు ఆధ్వర్యంలో అందజేసిన పండ్లు, రొట్టెలను ప్రభుత్వవిప్ ఉదయభాను పంపిణీ చేశారు. బేతెస్థ ప్రార్థనాల మందిరం, బేతోలు చర్చి, విలియంపేట, క్రిస్టియన్‌పేటలోని సిఎస్ఐ చర్చిలలో కాలేజ్ ఆఫ్ బైబిల్ టెక్నాలజీ పాస్టర్ విజయరావు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

చిల్లకల్లులో..

చిల్లకల్లు న్యూహోప్, సెయింట్ ఆన్స్ చర్చిలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. న్యూహోప్ వ్యవస్థాపకుడు ప్రభుదాసు మాట్లాడుతూ లోకరక్షకుడు జీసెస్ బోధనలు ఆచరణీయమని పేర్కొన్నారు. జయంతిపురం ఆమోద ఇండస్ట్రీస్‌లో ఎండీ ఉప్పుతోళ్ల కొండలరావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించగా, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను హాజరయ్యారు. అనంతరం చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేశారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: క్రిస్మస్ పర్వదినాన్ని వీరులపాడు మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లోని చర్చిలు, నిత్య సహాయమాత, పరిశుద్ధ లూర్దుమాత ఆలయాల్లో సోమవారం వేకువజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు క్రీస్తు జన్మదినాన్ని స్వాగతిస్తూ కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పొన్నవరంలోని గ్రేస్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్లు గొర్రెపాటి రత్నం, ఇమ్మానియేలు మాట్లాడుతూ శాంతియుత సమాజమే ఏసుక్రీస్తు సందేశమని పేర్కొన్నారు. సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, సతీష్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోడవాడ, జమ్మవరంలో..

మండలంలోని బోడవాడ, జమ్మవరం విచారణ పరిధిలోని పరిశుద్ధ లూర్దుమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ సాలే వినయ్ కుమార్ క్రీస్తు సందేశం ఇచ్చారు. దివ్యబలిపూజ కార్యక్రమం నిర్వహించి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు నన్నెబోయిన తిరుమలరావు, యాదాల దాసు, కర్ల రాణి, రాజు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో..

క్రిస్మస్ పండగ సందర్భంగా జగన్నాథపురంలోని నిత్య సహాయమాత ఆలయంలో ఫాదర్ సుగుణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్పంచ్ బండి విజయ్‌పాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జ్ఞానారెడ్డి, నరసింహారెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అత్యంత భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

కంచికచర్ల : క్రిస్మస్ పర్వదినాన్ని సోమవారం కంచికచర్ల మండల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవ దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఆరాధన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్థానిక సీఎస్ఐ, ఆర్‌సీఎం చర్చిలతోపాటు మండలంలోని అన్నిచర్చిలలో పాస్టర్లు క్రిస్మస్ కేక్ కట్‌చేసి భక్తులకు పంచిపెట్టారు. గండేపల్లి సీఎస్ఐ చర్చి పాస్టర్ ఎం.జాన్‌కోటేశ్వరరావు మాట్లాడుతూ క్రీస్తుసందేశం అందరికీ ఆచరణీయమని సూచించారు. 25ఏళ్లుగా గ్రామానికి చెందిన కె.వెంకట్, బొక్కా జగన్, రమేష్ కలిసి చర్చికి క్రిస్మస్ కేక్‌ను అందజేస్తున్నారంటూ వారికి అభినందించారు. కీసర, గొట్టుముక్కల, బత్తినపాడు, మోగులూరు, పరిటాల, వేములపల్లి, చెవిటికల్లు, కొత్తపేట, పేరకలపాడుతోపాటు అన్ని గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

క్రీస్తు జననం మానవాళికి శుభసూచకం



నందిగామ షాలేము చర్చిలో ప్రత్యేకప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: క్రీస్తు జననం సమస్త మానవాళికి శుభ సూచకమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. నందిగామ పాత బైపాస్‌రోడ్డులోని షాలేము ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ శాంతియుత సమాజమే ఏసుక్రీస్తు సందేశమని తెలిపారు. శాంతి, ప్రేమ, సంతోషాలకు క్రిస్మస్ పండుగ ప్రతీకని వివరించారు. ముఖ్యంగా క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయమైనవన్నారు. ఏసు చూపిన ప్రేమమార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఆయన సూచించారు. అనంతరం చర్చి నిర్వాహకులు ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధ్యక్షుడు బొక్కా జార్జిముల్లర్, పాస్టర్లు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నందిగామ ఆర్‌సీఎం చర్చిలో దివ్యబలి పూజ నిర్వహిస్తున్న దైవసందేశకులు



పెనుగంచిప్రోలు షాలేము చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పేట ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న విప్ సామినేని ఉదయభాను



జయంతిపురంలో నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలు



క్రిస్టియన్‌పేటలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న విప్ సామినేని ఉదయభాను



కంచికచర్లలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన మహిళలు



పొన్నవరంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

కమ్మేసిన పొగమంచు



పొగమంచు దెబ్బకు నందిగామ హైవేలో లైట్ల వెలుగులో వెళ్తున వాహనాలు



పెనుగంచిప్రోలు కాజ్‌వేపై లైట్ల వెలుగులో వెళ్తున్న వాహనదారుడు

నందిగామ: నందిగామ ప్రాంతాన్ని సోమవారం పొగమంచు కమ్మేసింది. వేకువజాము నుంచే ప్రారంభమైన పొగమంచు ఉదయం పదకొండు గంటల వరకు కొనసాగింది. మంచు బిందువులు వర్షపు చినుకులను తలపించాయి. ఎదుటివారు సైతం కనిపించనంత దట్టంగా కురిసిన పొగమంచుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా 65వ నంబరు జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలు ఉదయం వేళ సైతం లైట్ల వెలుగులో ప్రయాణించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా ప్రకృతి ప్రేమికులకు పొగమంచు కనువిందు చేసింది.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: చలితీవ్రత పెరగడంతోపాటు సోమవారం ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు కురవడంతో పెనుగంచిప్రోలు ప్రజలు ఇబ్బందులుపడ్డారు. రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్ల వెలుగులో ప్రయాణం సాగించాల్సి వస్తోందని వాహనచోదకులు తెలిపారు.



కంచికచర్లలో లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న వాహనదారులు

కంచికచర్లలో..

కంచికచర్ల : కంచికచర్ల పట్టణం కూడా ఉదయం తొమ్మిది గంటల వరకు మంచుతో కప్పబడింది. దీంతో ప్రజలు కొంత అసౌకర్యానికి గురయ్యారు. హైవేపై వాహనాల రాకపోకలు సైతం నెమ్మదిగా సాగాయి.

మొండితోక కృష్ణకు ఘననివాళి



తనతండ్రి మొండితోక కృష్ణ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామటౌన్): నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తండ్రి మొండితోక కృష్ణ ఐదో వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. చందర్లపాడులోని కృష్ణ సమాధి వద్ద ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన తనతల్లి కస్తాల మరియమ్మ, సోదరుడు మొండితోక నారాయణరావు ఘాట్‌లను సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కాకాని వెంకటరత్నం సేవలు శ్లాఘనీయం



కాకాని వెంకటరత్నం వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పెనుగంచిప్రోలు: మాజీమంత్రి కాకాని వెంకటరత్నం రాష్ట్ర రాజకీయాల్లో ఆదర్శనాయకుడని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కాకాని శ్రీనివాసరావు కొనియాడారు. వెంకటరత్నం వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కెవీఆర్ జడ్పీ హైస్కూల్, పాత సినిమా హాల్ సెంటర్‌లోని ఆయన విగ్రహాలకు సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సహకారసంఘాల ఏర్పాటుతోపాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి విశేషంగా కృషిచేసిన ఘనత కాకాని వెంకటరత్నంకు దక్కుతుందన్నారు. విద్యావ్యాప్తికి ఆయన చేసిన సేవలు శ్లాఘనీయమని కొనియాడారు. కాకాని వెంకటరత్నంకు నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్, మాజీ ఎంపీపీ వేగినేటి గోపాలకృష్ణమూర్తి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, మాజీ సర్పంచ్‌లు జిల్లేపల్లి సుధీర్‌బాబు, చింతల సీతారామయ్య, కార్యక్రమ నిర్వాహకులు కాకాని వెంకటేశ్వరరావు, కాకాని రవి, ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, విగ్రహ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విష్ణు సహస్రనామ పారాయణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు గోదా రంగనాథ స్వామివార్లకు పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. కార్యక్రమాలను మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

ముగిసిన స్వామినాథ స్వామి బ్రహ్మోత్సవాలు



చినకంచిలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం చినకంచిలో శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామీజీ ఆలయ ప్రాంగణంలోని స్వామినాథ స్వామి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చినకంచి ట్రస్టీ మొక్కపాటి శర్మ సమక్షంలో మూడు రోజులుగా సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామినాథ స్వామి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. చివరి రోజున వేద పాఠశాల విద్యార్థులతో కలిసి ట్రస్టీ మొక్కపాటి శర్మ పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వేదపండితులు స్వామివారికి చక్రస్నానం చేసి వసంతోత్సవం నిర్వహించారు. అలాగే స్వామినాథ స్వామి ఆలయ నిర్మాణ దాతలు మాగంటి సత్యనారాయణ మూర్తి, మధురావు తదితరులు వేద పాఠశాల విద్యార్థులను సత్కరించారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సచివాలయ ఉద్యోగి గుగులోతు రాజా

తిరువూరు: పేద కుటుంబానికి ఒక సచివాలయ ఉద్యోగి తనవంతు సాయాన్ని అందించారు. తిరువూరు మండలం లక్ష్మీపురం వద్ద టీస్టాల్ నడుపుకుని జీవనం సాగించే రాము ఇటీవల అనారోగ్యానికి గురై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు నరేష్, సల్మాన్‌ల ద్వారా ఆ కుటుంబ ఇబ్బందులను తెలుసుకున్న తిరువూరు పట్టణ పదో సచివాలయ ఉద్యోగి గుగులోతు రాజా క్రిస్మస్ సందర్భంగా ఆ కుటుంబానికి రూ.2వేలు, నెలరోజులకు సరిపడా బియ్యం అందజేశారు.